# కర్తవ్యం

'ప్రవాసి'



గౌతమి అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైకపుత్రుడు చనిపోయాడు. ఆమె హృదయం అత్యంత శోకవ్యాకులమైపోయింది. పిచ్చిదాని మల్లే బిడ్డ శవాన్ని భుజం మీద మోసుకుంటూ-

“ఎవరన్నా మందివ్వండి - ఏ తీరుగానైనా నా బిడ్డని బతికించండి” అంటూ మొరపెట్టుకొంటూ పరుగులు పెడుతోంది. ఇరుగూ పొరుగూవారు, ఊరివారంతా ఆమెనెంతో సముదాయించి నచ్చ చెప్పారు, కాని ఎవరిమాట ఆమె తలకెక్కలేదు. చివరికి ఆ వూరి కరణం సమీపంలో ఉన్న బౌద్ధారామాన్ని చూపిస్తూ “అమ్మా బౌద్ధారామంలో బుద్ధభగవానుల దగ్గరకు వెళ్ళి నీ దుఃఖాన్ని నివేదించుకో వారు నీ దుఃఖాన్ని రూపుమాపతారు” అని చెప్పాడు.

బిడ్డ శవాన్ని ఎత్తుకుని పరుగిడుతూ గౌతమి బుద్ధ దేవుల్ని ప్రార్థించింది తన పుత్రుణ్ణి ఏవిధంగానైనా బతికించమని-

“మంచి పనిచేశావు. నువ్వు సరైన చోటుకే వొచ్చావు. తప్పకుండా నీ బిడ్డని బతికిస్తాను. ఏ ఇంటిలో ఈ రోజుదాకా ఎవరూ చనిపోలేదో ఆ ఇంటినించి గుప్పెడు ఆవాలు తీసుకురా” అని చెప్పారు బుద్ధ భగవాన్.

గౌతమి బిడ్డ శవాన్ని గుండెలకదుముకుని పరుగులు పెడుతూ ఇంటింటికి వెళ్ళి ఆవాల బిక్ష నడిగింది. ఏ ఇంట్లో ఇప్పటిదాకా మృత్యువు పాదం పెట్టలేదో ఆ ఇంటినించి ఆవాల బిక్ష కావాలని అడుగుతూ. చివరకి ఇల్లిల్లూ తిరిగాక ఆమెకు అవగతమయ్యింది. ఏ ఇంట్లో నయినా చావు అన్నది అనివార్యంగా జరుగుతుందని, మృత్యువు ఏ ఉపాయం వల్ల ఆగిపోదనీ, చావుకడ్డుపడగలిగితే తమ ప్రియతమ సంబంధీకుల్ని ఎవరూ చావనివ్వరనీ ఒక్క ఇల్లే కాదు సమస్త విశ్వంలోనూ మృత్యువిహారం జరుగుతుందని. ఈ మాట ఆమెకి స్పష్టంకాగానే శ్మశానానికి వెళ్ళి బిడ్డడి శవాన్ని పాతిపెట్టి బుద్ధభగవానుల చెంతకిపోయి తన ఎరుకకి వచ్చిన సంగతిని నివేదించింది.

“చూడూ ఈ భూమ్మీద పుట్టిన ప్రతి ప్రాణి చావకతప్పదు ఇది సృష్టి నియమం. ఎలా మన ఇంటి మనుషులు చచ్చిపోతారో అలా మనమూ ఓరోజు చావక తప్పదు. అందువల్ల చావుకోసం వ్యర్థంగా వ్యాకులపడక, ఏ స్థితిని చేరుకుంటే జన్మ లేకుండా పోతుందో ఆ స్థితిని చేరుకునే సాధన చేసుకోవాలి. ఎప్పుడు పుటక లేకుండా పోతుందో అప్పుడు చావడమంటూ వుండదు. బుద్ధిశాలియైన మనిషి చెయ్యాల్సిన పని ఇది”- అని మరోమారు గౌతమికి స్పష్టం చేశారు. కరుణాపూర్ణ దరహాసంతో బుద్ధభగవాన్. ❋

## రంగులేయండి!

